క్లుప్తంగా

రైలు ప్రమాదంపై ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి

మైలవరం: ఒడిశా రైలు ప్రమాదం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శని వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒడిశా రైలు ప్రమాదం అత్యంత విషాధకరం అని, వందల సంఖ్యకు పైగా ప్రయాణికులు మృత్యువాత పడటం ఎంతో బాధాకరమైన విషయం అన్నారు. ఈ ప్రమాదం తనను కలచివేసిందన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. బాధితులకు రక్త దానంతో పాటు పలు సేవలు అందిస్తున్న వారందరికీ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం మేడూరులో కొండపైన వెలిసిన శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి శనివారం ఘనంగా శంకుస్థాపన చేశారు. అర్చకులు రామడుగు విక్రమాచార్యులు, బాదంపూడి శివరామలింగప్రసాద్ ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ముత్యాల వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి దంపతులతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు.

ఇంజినీరింగ్ కళాశాలకు స్వయంప్రతిపత్తి

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి లభించిందని ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. ఇప్పటి వరకు కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న ఈ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అటానమస్ హోదా కల్పించిందన్నారు. తమ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ కూడా దక్కిందని వివరించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

విస్సన్నపేట: మండలంలోని కలగర సచివాలయం పరిధిలో రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించటనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొంటారని చెప్పారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు గురించి అడిగి తెలుసుకుంటారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొనాలని కోరారు.

మజ్జిగ పంపిణీ

మైలవరం: మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ గత 20 రోజులుగా నిరాటంకంగా జరుగుతుంది. దాతలు వెంకట సాయి గోల్డ్ వర్క్స్ యజమాని ఎస్.వెంకటేశ్వరరావు, కోడూరుకు చెందిన ముఠామేస్త్రి బి.మాధవరావు సౌజన్యంతో శనివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శీలం ప్రతాపరెడ్డి, చామల సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ కార్యకర్తలకు శిక్షణ

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కార్యకర్తల శిక్షణ తరగతులు నిర్వహించారు. విజయవాడ రోడ్డులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి ఈ శిక్షణ తరగతులు ప్రారంభించారు. రాజ్యాధికారం సాధనకు కార్యకర్తలు సమష్టి కృషి చేయాలని ఆయన కోరారు. పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వందనకుమార్, ప్రధాన కార్యదర్శి పుష్పరాజ్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, తిరువూరు నియోజకవర్గ కన్వీనర్ మల్లయ్య పాల్గొన్నారు.

సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే రక్షణనిధి
- కలగర గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి, నాయకులు

కలగర (విస్సన్నపేట): అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నా రని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను పార్టీల కతీతంగా అందిస్తున్నామ న్నారు. మండలంలోని కలగర సచివాలయం పరిధిలో కలగర గ్రామంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహిం చారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుగురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా లబ్ధిదారులు పొందిన పథకాల వివరాల బుక్‌లెట్లను అందజేశారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకే కేంద్రాలకు నూతన భవణాలు నిర్మించామని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అనేక సేవలను ప్రజలకు చేరువ చేశామన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుడికి అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ దేశిరెడ్డి రమ, ఎంపీటీసీ వాసం పుల్లమ్మ, సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ శివ బాజీ, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, స్థానిక నాయకుడు దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీఐ ఆర్ బీమరాజు, ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, తహసీల్దార్ కే లక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మృతదేహంతో బంధువుల ఆందోళన..



సాంబశివరావు మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

విస్సన్నపేట: స్థానిక శ్రీశ్రీ కళాశాల సమీపంలో కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. విస్సన్నపేటకు చెందిన పిట్టల సాంబశివరావు (26), ఆకుల నాగరాజులు బైక్‌పై నూజివీడు వైపు వెళుతుండగా అటుగా వస్తున్న కారు, బైక్ ఢీ కొనడంతో సాంబశివరావు, నాగరాజు గాయపడ్డారు. వీరిని 108లో నూజివీడు ఏరియా ఆసుపత్రికి, మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడకు తరలించారు. చికిత్స పొందుతూ సాంబశివరావు మృతి చెందగా, నాగరాజుకు కాలు రెండు చోట్ల విరగటంతో చికిత్స పొందుతున్నారు.

మృతదేహంతో ఆందోళన..

సాంబశివరావు మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద, అంబేడ్కర్ సర్కిల్ వద్ద శనివారం రాత్రి ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని, రోడ్డు ప్రమాదానికి కారకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరువూరు సీఐ ఆర్ భీమరాజు మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



మైలవరం: విజయావాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి శనివారం వలంటీర్ రోసీనా పెన్షన్ అందజేశారు. మైలవరానికి చెందిన కే జానకిరామయ్య స్థానిక తిరువూరు రోడ్డులోని ఎస్ఎస్పీ కాలనీ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై విజయావాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మైలవరం సచివాలయం–5 వలంటీర్ రోసీనా విజయావాడ వెళ్లి లబ్ధిదారుడు జానకిరామయ్యకు పింఛన్ అందజేసింది. జగనన్న ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ పనిచేస్తున్న తీరును ప్రశంసిస్తూ పింఛన్‌దారు హర్షం వ్యక్త చేశాడు.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్ర గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు నీతి కథలు పుస్తకాలు చదివించారు. అనంతరం ఉపాధ్యాయుడు సీహెచ్ అశోక్ కుమార్ విద్యార్థులకు మ్యాథమెటిక్స్ గురించి క్లుప్తంగా వివరించారు. జీకే బిట్స్ చెప్పారు. కబడ్డీ, తొక్కుడు బిళ్ళ ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది టీ వెంటేశ్వర్లు, పాఠకులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖా గ్రంథాలయంలో పాఠకులు, విద్యార్థులు శనివారం ఒరిస్సాలో జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జవహర్ లాల్ నెహ్రూ జీవితం చరిత్ర, పంచతంత్ర కథలను విద్యార్థులతో చదివించారు. దేశంలోని రాష్ట్రాలు, రాజధానులు అన్న అంశంపై విద్యార్థులకు పోటీ నిర్వహించి షిరిడి సాయి సేవా సమితి సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందజేశారు. సైకిల్ దినోత్సవం సందర్భంగా శేషురెడ్డి మాట్లాడుతూ రోజు తప్పక గంటసేపైనా సైకిల్ తొక్కాలని తెలిపారు. షిరిడి సాయి సేవ సమితి సభ్యులు నారాయణరావు, ఉపాధ్యాయులు నాగరాజు, గ్రంథాలయ నిర్వహణాధికారి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ముసునూరు : గోపవరం గ్రంథాలయంలో గ్రంథపాలకుడు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. శనివారం విద్యార్థులకు నీతి కథల ప్రాధాన్యతపై పలువురు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పాఠకులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడు: పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో శనివారం విద్యార్థులతో పుస్తక పఠనం నిర్వహించారు. నీతి కథల పుస్తకాలను చదివించి కథలలో ఉన్న నీతి నిత్య జీవితంలో మనకు ఉపయోగపడుతుందని రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈమని శేషయ్య పేర్కొన్నారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది యశ్వంత్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో...

మండలంలోని గొల్లపల్లి శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. దీనిలోభాగంగా గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు విద్యార్థులతో కథలు చెప్పించారు. ఆంగ్ల భాష, హిందీ భాషల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. క్రమం తప్పకుండాగ్రంథాలయాలకు రావాలని సూచించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.వీరరాజు శనివారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఆదర్శ పాఠశాలలో బోధనా మాధ్యమం ఆంగ్లంతో ఉంటాయన్నారు. సంబంధిత ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ. 200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

కోడి పందేల శిబిరంపై దాడి

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం పంచాయతీ ముతరాశిపాలెం గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. వివరాలను ఎస్ఐ జీవీవీ సత్యనారాయణ వెల్లడించారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.1500 నగదు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో జూదాలు, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

సెల్‌టవర్ ఏర్పాటును అడ్డుకున్న గ్రామస్తులు



సెల్ టవర్ ఏర్పాటును అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఏ.కొండూరు: సెల్ టవర్ ఏర్పాటును గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన ఇది. మండలంలోని గోపాలపురం గ్రామ సమీపంలో సెల్ టవర్ ఏర్పాటు చేయడానికి వచ్చిన సెల్ టవర్ ప్రతినిధులు, గ్రామస్తుల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకులు మూడు రవి మాట్లాడుతూ గ్రామంలో గృహాల సమీపంలో సెల్ టవర్ నిర్మించటానికి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈ టవర్ ఏర్పాటు చేస్తే గ్రామ ప్రజలకు అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. గ్రామ ప్రజలందరి సహకారంతో టవర్ నిర్మించవద్దని అడ్డుకోవడం జరిగిందని తెలిపారు. గ్రామస్తులు, టవర్ ప్రతినిధుల మధ్య వాగ్వివాదం జరగడంతో ప్రతినిధులు వెనుతిరిగారు. ఈ గ్రామంలో ఎట్టి పరిస్థితుల్లో టవర్ నిర్మించటానికి వీల్లేదని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎం.బాలకృష్ణ, ఎం.నాగేశ్వరరావు, ఎం. భిక్షాలు, ఎస్.పూర్ణకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న అందరికీ ఉపాధి

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు, ఏ.కొండూరు, కంభంపాడు, రామచంద్రాపురం,కృష్ణారావుపాలెం, పోలిశెట్టిపాడు పలు గ్రామాల్లో జాబ్ కార్డులు ఉన్న వారందరికి ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నామని ఏపీవో జే రామారావు పేర్కొన్నారు. 21 గ్రామాల్లో 9000 మంది ఉపాధి హామీ పనులు చేస్తున్నారని వీరికి అవసరమైన వసతులు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట్ల నీడ, తాగునీరు సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ముసునూరు : తాగునీటి సరఫరాలో అతరాయంపై సర్పంచి సకాలంలో స్పందించి పరిష్కరించారు. మండలంలోని గోపవరం గ్రామంలో మెయిన్ ఏరియాలో శుక్రవారం వైండింగ్ కాలిపోవడంతో తాగునీరు సరఫరా చేసే మోటారు మొరాయించింది. గ్రామ సర్పంచ్ కంచర్ల వాణి స్పందించి, బోరు నుంచి మోటారును బయటకు తీయించి, ఏలూరుకు పంపించారు. రీ వైండింగ్, మరమ్మతుల అనంతరం శనివారం మధ్యాహ్ననికి ఏర్పాటు చేయించారు. దీంతో మంచినీటి సరఫరాలో అంతరాయం తొలగిపోయింది. సక్రమంగా ప్రజలకు తాగునీరు అందుతుందని వాణి పేర్కొన్నారు.

రైస్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

గంపలగూడెం: రైస్ కార్డు పొందేందుకు అర్హత కలిగిన వ్యక్తులు జూన్ 30వ తేదీలోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, తిరువూరు పీడీఎస్ డీటీ నాగరాజు తెలిపారు. జనవరి ఒకటో తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న వారికి జూలై నెలలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తకార్డులను జారీ చేస్తుందన్నారు. వివిధ కారణాలతో రైస్‌కార్డు తొలగించబడిన వారు ఉన్న రైస్‌కార్డులో అదనంగా కుటుంబ సభ్యులను చేర్చేందుకు, ఉన్న సభ్యులను తొలగించేందుకు, ఒంటరి వ్యక్తులు కొత్తగా రైస్‌కార్డులు పొందేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశం సచివాలయాల్లో కల్పించారన్నారు. జూన్ 30 దాటిన తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే జనవరి వరకు కార్డులు పొందేందుకు అవకాశం లేదన్నారు.

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం

తిరువూరు: రోజూ సైక్లింగ్ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తిరువూరు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తాళ్ళూరి రామకోటేశ్వరరావు అన్నారు. ప్రపంచ సైక్లింగ్ దినోత్సవ సందర్భంగా శనివారం తిరువూరు నుంచి లక్ష్మీపురం , చిట్టేల, ఆంజనేయపురం, పీటీకొత్తూరు మీదుగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్ తొక్కితే శరీర భాగాలు ఉత్తేజితమై కండరాలు పటిష్టమవుతాయని రామకోటేశ్వరరావు వెల్లడించారు. సైక్లింగ్‌తో వాతావరణ కాలుష్యం నివారించవచ్చన్నారు. ఆంజనేయపురం గ్రామ సర్పంచి మామిడి కుటుంబరావు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎస్పీ బాలుకి స్వరార్చన

నూజివీడు : ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని నూజివీడు కళావేదిక, శ్రీ సత్య సంగీత, నృత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం బాలుకి స్వరార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పురాణం కృష్ణప్రసాద్ తెలిపారు. బ్యాంకు స్ట్రీట్ సమీపంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో సాయంత్రం 5 నుంచి రాత్రి 9.30 గంటల వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో గాయనీ గాయకులు పాల్గొనాలని కోరారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



స్కిల్‌హబ్‌లో అవగాహన కల్పిస్తున్న ఐటీఐ కళాశాల సిబ్బంది

నూజివీడు : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో శనివారం స్కిల్ హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ దేవరకొండ భూషణం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించేందుకు కృషి చేస్తున్నాయన్నారు. దీనిలో భాగంగానే అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణనిచ్చి అనంతరం జాబ్‌మేళాలు నిర్వహించి ఉపాధిని కల్పిస్తోందన్నారు. యువతీ యువకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ డీ రామకృష్ణనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు బజారుకు శాశ్వత భవనాలు నిర్మించాలి

మైలవరం: స్థానిక రైతు బజారుకు శాశ్వత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు మంత్రిని కలిశామన్నారు. మైలవరంలో ఎప్పటి నుంచో రైతు బజారుకు శాశ్వత భవనం లేక రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి సౌకర్యార్థం పక్కాగా భవనాన్ని నిర్మించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిధులు మంజూరుకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని అప్పిడి సత్యనారాయణరెడ్డి వివరించారు.

జగనన్న కాలనీలో గృహప్రవేశం



గృహప్రవేశ కార్యక్రమంలో సర్పంచ్ మంజుభార్గవి, వైఎస్సార్ సీపీ నాయకులు

మైలవరం: మైలవరం గ్రామం అయ్యప్పనగర్ జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సహకారంతో అందజేసిన స్థలంలో షేక్ సుభానీ, భవానీలు ఇళ్లను నిర్మించుకున్నారు. శనివారం గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి మైలవరం సర్పంచ్ గరికిపాటి మంజుభార్గవి, వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు షేక్ కరీమ్, మండల మైనారిటీశాఖ మాజీ అధ్యక్షుడు షేక్ నన్నేబాబు, డానియల్, 4వ వార్డు సభ్యుడు షేక్ షఫీ, కోట రవి తదితరులు హాజరయ్యారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



తిరువూరు ఇందిరాకాలనీలో పిల్లలకు టీకాలు

తిరువూరు: స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఆరోగ్య సిబ్బంది వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అంగవైకల్యం, అనారోగ్యం బారిన పడకుండా ప్రతి చిన్నారికీ ఉచిత టీకాలు వేయించాలని యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి కృపారాణి కోరారు. ఈ టీకాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, నిర్ణీత షెడ్యూలు ప్రకారం తమ పిల్లలకు టీకాలు వేయించాలని తల్లులకు సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ రవి, హెల్త్ విజిటర్ పద్మావతి పర్యవేక్షించారు.

సీపీఐ నేత తిరుపతయ్యకు నివాళి



ఆముదాల తిరుపతయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఐ నేత

ముసునూరు : ఆదర్శ కమ్యూనిస్ట్‌గా ఆముదాల తిరుపతయ్య సేవలు అభినందనీయమని రాష్ట్ర సీపీఐ నేత చలసాని వెంకట రామారావు పేర్కొన్నారు. సీపీఐ ఏరియా మాజీ కార్యదర్శి, పలు భూపోరాటాల మార్గదర్శి దివంగత ఆముదాల తిరుపతయ్య రెండో వర్ధంతిని ఆయన స్వగ్రామం ముసునూరు మండలం రమణక్కపేటలో ఆముదాల తిరుపతయ్య, మేరీ రత్నావళి ట్రస్ట్ చైర్మన్ కాంతారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముందుగా ఆముదాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి చలసాని మాట్లాడుతూ 70, 80వ దశకాల్లో నూజివీడు ప్రాంతంలో పేదలకు భూములు పంచేందుకు కృషి చేసిన ఘనుడు ఆముదాల అని అన్నారు. చదువు–చదివించు నినాదంతో గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేశారని సీపీఐఎం లిబరేషన్ రాష్ట్రనేత హరనాథ్ కొనియాడారు. నూజివీడు మండలం కొత్తపల్లి మాజీ సర్పంచ్ బొకినాల కాంతకుమారి, వైఎస్సార్ సీపీ నేత పల్నాటి చంటి, రైతు సంఘ నేతలు దుర్గం పుల్లారావు, వేముల బక్కయ్య, టి.రమేష్, బి.వెంకటరత్నం, పాశం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



చెవుటూరు బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

జి.కొండూరు: తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సోలా రాఘవరాజు అన్నారు. మండల పరిధి చెవుటూరు గ్రామంలో ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు శనివారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీగా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న మౌలిక వసతులను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.